**కథ**

**సంధ్య ఒక్కతే సంతానం కావడంతో చాలా గారాబంగా పెరిగింది. పెళ్ళి చూపుల్లో ఆమెకు శశిధర్ బాగా నచ్చాడు. కానీ తనతో ఒంటరిగా మాట్లాడినప్పుడు ఆయన పెట్టిన షరతుకి తన మనసులో గుబులు మొదలయింది.**

తనలాగే శశి కూడా ఒక్కడే సంతానం కదా, ఇద్దరం హాయిగా వేరుగా వుండొచ్చని ఊహించుకుంది తను.

''మా అమ్మకి, నాన్నకి నేనొక్కడినే కదా. వాళ్ళు ఈ వయసులో కష్టపడడం ఎందుకని పెళ్ళయిన తరువాత, అందరం కలిసే వుందామని అనుకున్నాను. ఈ షరతుకి నీకభ్యంతరం ఏమయినా వుంటే ఇప్పుడే చెప్పు సంధ్యా..'' ఆయన తనతో అన్నమాటలు ఆమె మెదడుని తొలిచేస్తున్నాయి.

పెళ్ళయిన తరువాత ఎంతోమంది తమ భర్తల మనస్సుల్ని మార్చడం లేదు. అందుకే తను శశిని పెళ్ళి చేసుకోవడానికి నిర్ణయించుకుంది.

సంధ్య, శశిధర్‌ల వివాహం ఘనంగా జరిగింది.

అప్పగింతల కార్యక్రమంలో తను చిత్రంగా వెక్కి, వెక్కి ఏడ్చింది. అమ్మకి, నాన్నకి చిన్నప్పటినుండి ఆడీ పాడి పెరిగిన ఆ ఇంటికి, ఈరోజునుండీ తను పరాయిదయిపోతుందనే భావం కన్నీళ్లరూపంలో నన్ను ముంచెత్తిందో, లేక ఎరుగని వాతావరణంలోకి అడుగు పెడుతున్నందుకో అర్థం కాలేదు తనకి.

శశి తనని కార్లో కూర్చోబెట్టి, కారు స్టార్ట్ చేసాడు.

అందరి దగ్గరా కన్నీళ్ళతో వీడ్కోలు తీసుకొని నాదనే ఓ కొత్త ప్రపంచంలోకి అడుగుపెట్టాను.

అంతా బాగానే వున్నా, నాలో తెలియని వెలితిని మాత్రం పూడ్చలేకపోతున్నాను. బహుశా...అది మా అత్తమామలు మాతోనే వుంటున్నారనే కావచ్చు.

అసలు నాలో ఇంత సంఘర్షణకు కారణం అమ్మే అయ్యుండొచ్చు.

అమ్మ కూడా నానమ్మ పెట్టిన బాధలు తట్టుకోలేక వేరే వచ్చేసారు. తరువాతే నానమ్మ కాలం చేసినా అమ్మమటుకు ఇప్పటికీ భయపడుతుంది నాన్నమ్మ గుర్తొస్తే. అందుకే తనకు భయం.

అదే తనూ, శశీ వేరుగా వుంటే ఏ బాధా వుండదు. అప్పుడప్పుడు వెళ్ళి చూసిరావచ్చు.

అవును. ఇలానే చెప్పాలి శశితో. చెప్పి ఎలా అయినా ఒప్పించాలి. అందునా..ఈరోజు మా మొదటిరాత్రి. అందరికీ ఇది మరలిరాని రాత్రి. ఈరోజు ఏం చెప్పినా తను కాదనడని తన నమ్మకం. శశి రాకతో తన ఆలోచనల ప్రవాహానికి అడ్డుపడింది.

శశి చాలా ప్రశాంతంగా కనిపిస్తున్నాడు.

అతనిలో ఆ ప్రత్యేకతే తనని అంతలా ఆకర్షించేలా చేసింది. వచ్చి తనముందు కూర్చున్నాడు. నా చేతిని తన చేతిలోకి తీసుకొని–

''మొదట పెళ్ళిచూపుల్లో చూసినపుడు, నాకూ మీరు బాగా నచ్చారు శశి. ప్రత్యేకంగా మీ ప్రశాంతత. మీరు నా భర్తయితే చాలనుకున్నాను.''

''అది నా అదృష్టం సంధ్యా. నన్ను కని, పెంచి ఇంత మంచి హోదాలో వుండడానికి శాయశక్తులా కృషిచేసిన నా తల్లిదండ్రులను మనతోపాటే వుండమనడం తప్పుకాదు కదా? మా అమ్మ, నాన్నంటే నాకు చాలా ఇష్టం. నువ్వూ వాళ్ళలో మీ అమ్మనీ, నాన్ననీ చూసుకో. ఏ సమస్యా వుండదు.



# కాంతికిరణం

సరేనా..?''

''అలాగే'' అంది ఏమనాలో తెలియక.

''ఇలా మాట్లాడుకుంటూ కూర్చుంటే మన తొలిరేయి మనల్ని ఎన్నటికీ క్షమించదు. మరి ఆలస్యం ఎందుకింక? మనం పుట్టినరోజు పాపాయిలమవుదాం'' అంటూ తన మీదకు లాక్కున్నాడు.

ఇంక ఈరోజు ఏం చెప్పదల్చుకుందో, అది రేపటికి వాయిదా పడింది. శశి కౌగిలిలో కరిగిపోయాను.

మర్నాడు, ఆ మర్నాడు, అలా ఆ విషయం వాయిదా పడుతూనే వుంది. అత్తగారు, మావగారు తనని కంటికిరెప్పలా చూసుకుంటున్నారు.

నేననుకున్నదానికి అంతా విరుద్ధంగా వుంది ఇక్కడ. శశి ప్రేమలో నాకు సమయమే తెలియడం లేదు. కానీ..ఎందుకో అత్తగారిని, మావగారినీ మనస్ఫూర్తిగా అంగీకరించలేకపోతున్నాను. నా ముభావన వల్ల వాళ్ళ మనసు నొచ్చుకుంటుందని తెలిసీ, తన మనసెందుకు మొండికేస్తుందో అర్థం కావడం లేదు.

**పి. మాధవి**

శశి ఆఫీస్ నుండి రావడంతోటే డల్‌గా కనిపించాడు. తన మనసు విలవిల్లాడింది. ఏమైందని?

''ఏమైందని'' అడిగేలోపే, తనే చెప్పాడు.

''అమ్మా, నాన్నా ఊర్లోనే వుంటారంట. అక్కడ ఇల్లు ఎందుకు ఖాళీగా వుండడం. అదీకాక ఇక్కడ ఈ సిటీలైఫ్‌కు అలవాటు పడలేకపోతున్నారంట. మనమేమన్నా లోపం చేస్తున్నామా సంధ్యా..'' చాలా బాధపడుతున్నట్లు ఆ మొహమే చెబుతుంది.

అత్తయ్య, మావయ్య వెళతామన్నందుకు ఆనందపడాలో, శశి ఇంతలా అప్‌సెట్ అవుతున్నందుకు బాధపడాలో అర్థం కావడం లేదు.

అయినా..ఎన్నాళ్ళీ బాధ. తన ప్రేమలో శశిని తన మనిషిని చేయదూ..?

రాత్రి మంచి నిద్రలోనుండి హఠాత్తుగా మేల్కొన్నాను. అత్తయ్యగారి గదినుండి సన్నగా ఏడుపు వినిపిస్తోంది. చాటుగా వారి మాటలు వినడం సంస్కారం అనిపించుకోకపోయినా..ఈ సమయంలో వాళ్ళు ఏం మాట్లాడుకుంటున్నారని మెల్లగా లేచెళ్ళి తలుపు పక్కనే వుండి వినసాగాను.

''ఊరుకో లక్ష్మీ. మనల్ని చూసుకునే కొడుకు వున్నా, వాడిదగ్గర వుండే అదృష్టం మనకి లేదు. కోడలు మనసు బాధపెట్టడం ఎందుకు చెప్పు? అయినా మనకి మన ఊర్లో ఏం తక్కువయిందని? ఈరోజుల్లో అత్తాకోడళ్ళు కలిసి ఎక్కడ వుంటున్నారు చెప్పు? అప్పుడప్పుడు వచ్చి చూసి వెళతాం కదా. అదిగో..ఏడవకు. మళ్ళీ అబ్బాయి, కోడలు లేస్తే బావోదు'' మావగారు మాటలతో ఆమెను ఓదారుస్తున్నారు.

''నా బాధంతా కోడలు మనల్ని సరిగా అర్థం చేసుకోలేదనేనండి. నేను తనతో మాట్లాడుతున్నప్పుడు తన మొహంలో పలికే భావం నాపై తన పూర్తి వ్యతిరేకత తెలియజేసినట్లయి మనసుని బాధిస్తుందండి. మనం తనకి అడ్డని కోడలు భావిస్తున్నట్లుంది. అందుకే, వాళ్ళు సుఖంగా వుండాలంటే మనం దగ్గరగా వుండకూడదనే వెళ్ళిపోదాం అన్నాను'' ఏడుస్తూ అంటున్నారు అత్తగారు.

మొదటిసారి నా తప్పు నాకు తెలిసొచ్చింది. నా అర్థం లేని అపోహలతో వాళ్ళ సున్నితమైన మనసులని గాయపరిచాను. ఆ హక్కు నాకెవరిచ్చారు? అందరి అత్తలూ ఒకేలా వుంటారని అనుకుని, ఇంత సంస్కార హీనంగా ఎలా ప్రవర్తించగలిగాను. పోస్ట్‌గ్రాడ్యుయేట్ నయుండి, చిన్న విషయం ఆలోచించ లేకపోయినందుకు సిగ్గనిపించింది. అంత మంచి మనిషికి భార్య అయినందుకు వాళ్ళని తన తల్లిదండ్రులుగా చూసుకునే బాధ్యత తనమీద ఎంతో వుంది. ఆ నిర్ణయానికి రాగానే వెళ్ళి నిశ్చింతగా నిద్రపోయాను.

ప్రొద్దుటే అత్తయ్య, మావయ్యలని క్షమించమని మనస్ఫూర్తిగా కోరాను. అంత మంచి మనసు వున్నవాళ్ళు నన్ను క్షమిస్తారని నాకు తెలుసు.

''మీ పిల్లలు తప్పుచేస్తే మీరు దాన్ని సరిదిద్దుతారు కదా అత్తయ్యా..నేనూ మీ కూతురితో సమానం అనుకుని మమ్మల్ని విడిచి ఎక్కడికీ వెళ్ళొద్దు'' బాధతో నా గొంతు బొంగురుపోయింది.

అత్తయ్య, మావయ్య, శశి, అంతా ఆనందంగా వున్నారు. వాళ్ళ కళ్ళల్లో మెరిసిన మెరుపులు నేనెన్నటికీ మరువలేను. మా ఇంట్లో ఓ 'కాంతికిరణం' మెరిసింది... ★